# మంద జగన్నాథానికి ఘన నివాళి



మాజీ ఎంపీ మంద జగన్నాథం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా సోమవారం హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో జరిగిన దశదినకర్మలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, గువ్వల బాలరాజు హాజరయ్యారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. – మహబూబ్‌నగర్ అర్బన్/జడ్చర్ల, జనవరి 20

# ప్రొఫెసర్ హరగోపాల్ అరెస్ట్ దారుణం

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, జనవరి 20 (నమస్తే తెలంగాణ) : ప్రజాపాలన పేరుతో సాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను పీడించే పాలనను చేస్తున్నదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. అచ్చంపేట నియోజకవర్గం బల్మూరు మండలం మైలారంలో మైనింగ్‌కు వ్యతిరేకంగా గ్రామస్తులు నిర్వహిస్తున్న నిరసనకు మద్దతు తెలిపేందుకు వెళ్లిన ప్రొఫెసర్ హర గోపాల్, ప్రజా సంఘాల నాయకులను అరెస్ట్ చేయడాన్ని మాజీ మంత్రి ఖండించారు. కాంగ్రెస్ సర్కార్ నియంతృత్వ పాలనకు నిదర్శనమే పౌరహక్కుల నేతల అరెస్ట్‌లని, హర గోపాల్ ప్రశ్నించే గొంతుకగా ప్రజల జీవన విధానానికి భంగం కలిగించే మైనింగ్ ఆపాలని పోరాడుతున్న ఆయనను అరెస్ట్ చేయడం దారుణమని, ఇంతకాలం కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చిన మేధావులు ఇప్పటికైనా పునరాలోచించి ప్రజల పక్షాన నిలబడాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తప్పిదాలను మేధావివర్గం ఎప్పటికప్పుడు ఎండగట్టాలని, లేకుంటే మరిన్ని నిర్బంధాలు పెరిగే అవకాశం ఉందన్నారు.



వనపర్తి జిల్లా ఎస్పీని కలిసి మాట్లాడుతున్న కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

# శ్రీధర్‌రెడ్డి హంతకులను అరెస్ట్ చేయండి

- ఏడు నెలలుగా కేసును ఎందుకు పెండింగ్‌లో ఉంచారు
- ఎస్పీని కలిసి విజ్ఞప్తి చేసిన మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

వనపర్తి, జనవరి 20 (నమస్తే తెలంగాణ) : చిన్నంబాయి మండలం లక్ష్మీపల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు బొడ్డు శ్రీధర్ రెడ్డిని హత్య చేసిన హంతకులను వెంటనే అరెస్ట్ చేయాలని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఎస్పీ రావుల గిరిధర్‌ను కలిసి శ్రీధర్‌రెడ్డి హత్యకు సంబంధించి విషయాలపై చర్చించారు. ఇటీవలే చిన్నంబాయి మండలం కేంద్రంలో హంతకులను అరెస్ట్ చేయాలని ఆందోళన చేపట్టిన క్రమంలో బీరం ఎస్పీని కలవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బీరం మాట్లాడుతూ శ్రీధర్‌రెడ్డి హత్య జరిగి ఏడు నెలలు గడిచినా హంతకులను ఎందుకు అరెస్ట్ చేయడం లేదో విడ్డూరంగా ఉందన్నారు. హంతకులను పట్టుకోవడంలో ఇంత నిర్లక్ష్యం చేయడం వల్ల కుటుంబ సభ్యులు, ప్రజలు ఆత్మస్థైర్యం కోల్పోయే పరిస్థితులు ఉత్పన్నమవుతాయని, ఇప్పటికే ఏడు నెలలు వేచి చూశామని, మా సహనానికి పరీక్ష పెట్టవద్దన్నారు. హంతకులను పట్టుకునే దాకా వదిలేది లేదని, ప్రజాక్షేత్రంలో ఉద్యమం చేపడతామని బీరం తేల్చిచెప్పారు. హత్య కేసుపై నాన్చుడు ధోరణి విడనాడి త్వరగా హంతకులను అరెస్ట్ చేయాలని బీరం ఎస్పీని కోరగా త్వరలోనే హంతకులను అరెస్ట్ చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. ఎస్పీని కలిసిన వారిలో బీరం తోపాటు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, నాయకులు అభిలాష్‌రావు, సోమేశ్వరమ్మ, వెంకట్రావమ్మ, చిన్నారెడ్డి, గోవింద్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, నాగన్నయాదవ్ తదితరులు ఉన్నారు.

# డబుల్ బెడ్రూం ఇండ్లు మంజూరు చేయాలి



మహబూబ్‌నగర్ తాసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న లబ్ధిదారులు, నాయకులు

- మహబూబ్‌నగర్ తాసీల్దార్ కార్యాలయం ముట్టడి

మహబూబ్‌నగర్, జనవరి 20 : ప్రభుత్వం తమను డబుల్ బెడ్రూం ఇండ్లకు అర్హులుగా ఎంపిక చేసిందని వెంటనే ఇండ్లు మంజూరు చేయాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మహబూబ్‌నగర్ అర్బన్ తాసీల్దార్ కార్యాలయాన్ని టీపీ ఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులు ముట్టడించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీపీ ఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఖలీల్ మాట్లాడుతూ అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వకుండా సర్వేలు విచారణలని కాలయాపన చేయడం తగదన్నారు. పదుల సార్లు విచారణ జరిపి, ఇచ్చిన పట్టా సర్టిఫికెట్లను స్వాధీనపరుచుకొని డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వడంలో జాప్యం ఎందుకు చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. అర్బన్ మండల పరిధిలో 4800 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఇంటిస్థలం ఉన్నవారికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని ప్రభుత్వం ప్రకటిస్తుందని, ఇల్లుగాని ఇంటిస్థలం గాని లేని పేదల పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నించారు. వందల ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా ఎందుకు అది పేదలకు ఇండ్ల స్థలాల కోసం పంచడం లేదని నిలదీశారు. అర్బన్ మండల పరిధిలోని ప్రభుత్వ భూమి వివరాలు తెలుపుతూ శ్వేతపత్రం విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాలన్ని తాసీల్దార్ ఘాన్సీరాంనాయక్‌కు అందజేశారు. కార్యక్రమంలో టీపీ ఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు రామకృష్ణ, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు విజయ్‌కుమార్, యాదగిరి, జిల్లా నాయకులు జలాల్ పాషా, గట్టన్న, జయపాల్, బాలకృష్ణ, గోవిందు, డబుల్ బెడ్రూం లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఆర్టిజన్లను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలి



శ్రీశైలంలో రిలే నిరాహారదీక్షలు చేపట్టిన విద్యుత్ జేఏసీ నాయకులు

- శ్రీశైలం జెన్‌కో కార్యాలయం ఎదుట రిలే నిరాహారదీక్షలు ప్రారంభం

దోమలపెంట, జనవరి 20 : విద్యుత్ సంస్థలో పనిచేస్తున్నటువంటి ఆర్టిజన్లకు కన్వర్షన్ ఇచ్చి రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్- జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం శ్రీశైలం ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రం సర్కిల్ కార్యాలయం ఎదుట ఆర్టిజన్లు రిలే నిరహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్-జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు మాట్లాడుతూ సుమారు 20వేల మంది ఆర్టిజన్ కార్మికులు గడిచిన ఐదు నెలలుగా వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమలు చేపట్టామని, ఎన్‌పీడీసీఎల్, ఎస్‌పీడీసీఎల్, టీజీజెన్‌కో, ట్రాన్స్‌కో కార్యాలయాల ఎదుట, అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఇందిరాపార్క్ వద్ద వేలాది మంది కార్మికులతో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించామన్నారు. అదేవిధంగా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, నాలుగు కంపెనీల సీఎం డీలను కలిసి వినతిపత్రాలు అందజేసినా ఎటువంటి న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తోపాటు విద్యుత్ యజమాన్యం మొండి వైఖరిని నిరసిస్తూ ఆందోళనలు ఉధృతం చేస్తామని, అందులో భాగంగా సోమవారం నుంచి 24వ తేదీ వరకు రిలేనిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. మొదటి రోజు బి.లక్ష్మయ్య, రాంరెడ్డి, సత్యనారాయణ, రవి, సుబ్బారెడ్డి, చంద్రకళ, సరోజిని దీక్షలో పాల్గొనగా వారికి సీఐటీయూ, 327, 1104 యునియన్ నాయకులు సంఘీభావం ప్రకటించారు.

# అదుపుతప్పిన ప్రైవేటు పాఠశాల బస్సు

- విద్యార్థులకు తప్పిన ప్రమాదం

అయిజ, జనవరి 20 : పట్టణంలోని ప్రైవేటు పాఠశాల బస్సు అదుపు తప్పి డ్రైనేజీలోకి దూసుకెళ్లింది. సోమవారం విద్యార్థులకు పాఠశాలకు తరలిస్తున్న క్రమంలో బాలికల ఉన్నత పాఠశాల సమీపంలో మూలమలుపు వద్ద బస్సును రోడ్డుపైకి తీసుకున్న సమయంలో పక్కనే ఉన్న చిన్నపాటి డ్రైనేజీలోకి బస్సు చేరింది. దీంతో బస్సులో ఉన్న విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. పక్కనే ఉన్న కాలనీ వాసులు బస్సు దగ్గరకు చేరుకుని విద్యార్థులను కిందకు దింపి బస్సును రోడ్డుపైకి చేర్చారు. విద్యార్థులకు పెను ప్రమాదం తప్పడంతో తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం ఊపిరి పీల్చుకున్నది.



డ్రైనేజీలోకి దూసుకెళ్లిన ప్రైవేటు పాఠశాల బస్సు

## మైనింగ్‌కు వ్యతిరేకంగా..

బల్మూరు మండలం మైలారం శివారులో మైనింగ్ పనులను నిరసిస్తూ ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. కొన్ని నెలలుగా పనులను ఆపాలని అడ్డుకుంటున్న వారిపై కేసులు నమోదు చేశారు. అధికారులు, ప్రభుత్వం నుంచి స్పందన కరువైంది. ఈ నేపథ్యంలో 20వ తేదీ నుంచి 27వ తేదీ వరకు శాంతియుతంగా నిరసన రిలే నిరాహార దీక్షలు చేయడానికి సిద్ధమయ్యారు. అయితే ఈ విషయం తెలుసుకొన్న పోలీసులు తెల్లవారుజాము 5 గంటలకే గ్రామానికి చేరుకొన్నారు. ఉదయం నుంచి పొలాల వద్ద.. ఇండ్ల వద్ద ఉన్న పలువురిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ గ్రామంలోకి పోలీసులు రాకుండా ప్రధాన రోడ్లపై కంపచెట్లు.. కట్టెలను వేశారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అక్కడకు చేరుకొన్న పోలీసులతో వాగ్వాదానికి దిగారు. బల్మూరు స్టేషన్‌లో ఐదుగురిని, అచ్చంపేట పీఎస్‌లో ఒకరిని ఉంచారు. అయితే కాంగ్రెస్ నేత బాలా గౌడ్‌ను విడుదల చేసి మిగితా వారిని స్టేషన్‌లోనే ఉంచడంపై ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులపై, పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బల్మూరు ఎస్సై రమాదేవి ఆధ్వర్యంలో గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. లింగాల, అమ్రాబాద్, ఉప్పునుంతల ఎస్సైలు, పోలీసులు గ్రామంలో మోహరించారు. అయినా భయపడకుండా.. మా ప్రాణాలు పోయినా మైనింగ్‌ను ఒప్పుకునేది లేదని తేల్చిచెప్పారు. పనులను జరగనివ్వమని, ఎలాగైనా అడ్డుకొని తీరుతామని హెచ్చరించారు. మా ఊరును మేమే కాపాడుకుంటాం.. మాకు న్యాయం జరిగే వరకు నిరసన కొనసాగుతుందన్నారు. ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యేపై శాపనార్థాలు పెట్టారు. తవ్వకాలు నిలిపివేయకుంటే ఆత్మహత్య చేసుకుంటానని మహిళ పురుగుల మందు తాగేందుకు యత్నించారు.. తోటి వారు అడ్డుకున్నారు. నిరసన తెలియజేస్తున్న మరో మహిళ సొమ్మసిల్లి కింద పడిపోయింది. వెంటనే పోలీసులు గ్రామాన్ని విడిచి వెళ్లాలని నినాదాలు చేయడంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొన్నది. గ్రామ సభ అనుమతి లేకుండా మైనింగ్ ఎలా జరుపుతారని నిలదీశారు. ఎవరొచ్చినా.. మా ప్రాణాలు పోయినా మైనింగ్ తవ్వకాలు జరగనివ్వమని తెగేసి చెప్పారు. ఎన్నికల్లో వంశీకృష్ణ గెలుపునకు గ్రామమంతా ఏకమై ఓటేసి ఎమ్మెల్యేగా గెలిపిస్తే.. నేడు మా చావును ఆయన కోరుతున్నారని ఆగ్రహం చెందారు. అనంతరం అచ్చంపేట సీఐ రవీందర్ వచ్చి నిరసనకారులతో మాట్లాడారు. వారు ససేమిరా అనడంతో చేసేది లేక అరెస్టు చేసిన వారిని వదిలి పెట్టారు. దీంతో గ్రామస్తులు శాంతించి రోడ్డుపై వేసిన కంపను తొలగించారు.



### గుట్టపై అడ్డంగా టిప్పర్

మైలారం గ్రామంలో జరుగుతున్న మైనింగ్ పనులను ఫొటో కవరేజ్ కోసం వచ్చిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాను మాఫీయా అడ్డుకున్నది. అక్కడ పనులు చేస్తున్న సిబ్బంది మీడియాపై చిందులు వేశారు. పని వద్దకు వెళ్లకుండా గుట్టపై అడ్డంగా టిప్పర్‌ను ఉంచారు. మీడియాకు అనుమతి లేదంటూ దురుసుగా వ్యవహరించారు.



మైలారంలో మైనింగ్ అపాలంటూ.. పోలీసులు గ్రామంలోకి రావొద్దంటూ రోడ్డుపై కంప వేసి స్థానికుల నిరసన

# మైలారంలో హై టెన్షన్

- మైనింగ్ వద్దు.. గుట్టనే ముద్దంటూ నినాదం
- తవ్వకాలకు వ్యతిరేకంగా రిలే దీక్షలకు శ్రీకారం
- తెల్లవారుజాము 5 గంటలకే అరెస్టు చేసిన పోలీసులు
- ఆగ్రహంతో రోడ్డుకు అడ్డంగా ముళ్ల కంపలు
- పురుగుల మందు డబ్బాతో స్థానికుల ఆందోళన
- నిరసనలో సొమ్మసిల్లి పడిపోయిన మహిళ
- తవ్వకాల వద్దకు మీడియా వెళ్లకుండా టిప్పర్‌ను అడ్డంగా ఉంచిన మైనింగ్ మాఫీయా



వెల్దండ పీఎస్‌లో మాట్లాడుతున్న హరగోపాల్



మైనింగ్ పనులు చేస్తున్న మైలారం గట్ట



నిరసనలో స్పృహ కోల్పోయిన శాంతమ్మ

అచ్చంపేట/బల్మూరు, జనవరి 20 : నల్లమలలో లభించే విలువైన ఖనిజ సంపదపై కన్నేసిన కార్పొరేట్ శక్తులు, మైనింగ్ మాఫియా ఆగడాలపై గ్రామస్తులు భగ్గుమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పుట్టిపెరిగిన సొంత నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని బల్మూర్ మండలంలోని మైలారం గ్రామంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొన్నది. గ్రామానికి ఆనుకొని ఉన్న పలుగురాళ్ల గుట్టను మైనింగ్ మాఫియా ముడిసరుకును (తెల్లరాయిని) వెలికితీసే పనులు చేపట్టింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మైనింగ్ కంపెనీ పోలీసులు, ప్రభుత్వ సహకారంతో పనులు ప్రారంభించింది. మైనింగ్, రెవెన్యూ, పోలీసు శాఖలు మైనింగ్ వ్యాపారులకు అండగా నిలిచాయి. దీంతో పనులను అడ్డుకునే ప్రయత్నం చేసిన గ్రామస్తులపై పోలీసులు కేసులు పెట్టారు. మైలారం గుట్టను మైనింగ్ వెలికితీతకు 2017లో మైనింగ్ తవ్వకాలకు అనుమతిపొందారు. కానీ గ్రామస్తులు అనుమతులను వ్యతిరేకించడంతో ఎలాంటి పనులు చేపట్టలేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో మైనింగ్ వ్యాపారస్తులు మళ్లీ పనులు షురూ చేశారు. నాటి నుంచి గ్రామస్తులు శాంతియుతంగా నిరసన కార్యక్రమాలను చేస్తూనే వచ్చారు. గ్రామస్తులు, ప్రజా సంఘాలు మొదటి నుంచి మైనింగ్ తవ్వకాలను వ్యతిరేకంగా అందోళనలు చేస్తున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి వినతిపత్రాలు ఇచ్చారు. పార్లమెంట్ ఎన్నికలను కూడా బహిష్కరించారు. అధికారులు వెళ్లి గ్రామస్తులను నచ్చజెప్పి పోలింగ్ జరిగేవిధంగా చూసిన గ్రామస్తులు పెద్దగా పోలింగ్‌లో పాల్గొనలేదు. దీంతో కొన్ని నెలలుగా పోలీసుల రక్షణలో తవ్వకాలు జరుపుతున్నారు. గతంలో అనేకసార్లు గ్రామస్తులు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సమావేశాలు పెట్టి, ఆందోళనలు చేశారు. పనులు అడ్డుకునే ప్రయత్నం చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రజల అనుమతి లేకుండా, ప్రజాభిప్రాయం సేకరణ జరుపకుండా కొనసాగుతున్న మైనింగ్ పనులను ఆపలేకపోయారు. మైనింగ్ తవ్వకాలు నిలిపివేసి మాగుట్టను కాపాడాలని మైలారం గ్రామస్తులు హైకోర్టులో ఫిర్యాదు చేశారు. గ్రామానికి ఆనుకొని ఉన్న పలుగు రాళ్లగుట్ట కళ్ల ముందే మైనింగ్ మాఫియాకు బలైపోతుంటే గ్రామస్తులు జీర్ణించుకోవడం లేదు. ఇక తమ ఆందోళనను ఉధృతం చేసి ప్రభుత్వం పెద్దల దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. సోమవారం నుంచి వారంరోజులపాటు శాంతియుతంగా రిలే నిరాహార దీక్షలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. పోలీసులు దీక్షలను అడ్డుకునే క్రమంలో ముందస్తుగా తెల్లవారుజామున 5 గంటలకు గ్రామంలోకి ప్రవేశించి గ్రామ పెద్దలు, మహిళలు, యువకులను అదుపులోకి తీసుకొని కొందరిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

### ప్రజల చావులు కోరుతున్నారు..



"2009 నుంచి అచ్చంపేట ప్రాంతనికి చెందిన వ్యక్తి ఓడిపోవడం జరుగుతుందని వంశీకృష్ణపై సానుభూతితో గ్రామంలో యువకులు, మహిళలు పార్టీలకు అతీతంగా ఓటు వేసి ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఆయన 2024 నుంచి గ్రామంలో మైనింగ్ మాఫీయకు అండగా ఉంటూ సానుభూతితో పనిచేసిన ప్రజలు చావులు చూడాలనుకోవడం బాధాకరంగా ఉంది. అలాంటి వ్యక్తికి ఎందుకు ఓటు వేశామా అని ఇప్పుడని పిస్తున్నది."

–గుండాల గాయత్రి, గ్రామస్తురాలు, మైలారం

### మైనింగ్ పనులు ఆపాలి..



"మైనింగ్ పనులకు అప్పటి ఉమ్మడి గ్రామ పంచాయతీయే కారణం. ఎందుకంటే మైనింగ్ సిబ్బందితో అప్పటి అనంతవరం ప్రజాప్రతినిధులు రూ.50లక్షలు తీసుకొని అనుమతులు ఇచ్చారు. దీంతో వారు యథేచ్ఛగా మైనింగ్ పనులు ప్రారంభించడంతో మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. మా ఇండ్లన్నీ పాడవుతున్నాయి. వీటిని ఆపాలని కోరుతున్న వారిపై పోలీసు కేసులు పెడుతున్నారు. ప్రభుత్వమైనా స్పందించి మైనింగ్ పనులు ఆపాలి."

- బాలయ్య, గ్రామస్తుడు, మైలారం

### వెల్దండలో ప్రొఫెసర్ హరగోపాల్ అరెస్టు

వెల్దండ, జనవరి 20 : మానవ హక్కుల సంఘం నేత, ప్రొఫెసర్ హరగోపాల్‌ను వెల్దండ పోలీసులు అరెస్ట్ చేశారు. బల్మూర్ మండలం మైలారంలో మైనింగ్ తవ్వకాలు నిలిపివేయాలని గ్రామస్తులు ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న హర గోపాల్ సోమవారం హైదరాబాద్ నుంచి మైలారం వెళ్తుండగా వెల్దండలో పోలీసులు ఆయన్ను అరెస్ట్ చేశారు. గంటపాటు స్టేషన్‌లో ఉంచి అనంతరం సొంత పూచీకత్తుపైవిడుదల చేశారు. దీంతో ఆయన బల్మూర్ వెళ్లకుండా వెల్దండ నుంచే హైదరాబాద్‌కు వెనుదిరిగారు. అయితే ప్రొఫెసర్ హర గోపాల్ అరెస్ట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నామని మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ అన్నారు.

# కౌన్సిలర్ల కన్నెర్ర

- భూత్పూరు మున్సిపల్ కార్యాలయానికి తాళం
- సమస్యలు ఫుల్.. అభివృద్ధి నిల్ అంటూ ఆగ్రహం
- కమిషనర్ లేడు.. కౌన్సిల్ సమావేశం జరిగేదెన్నడో..
- మూడు నెలలుగా చెత్త సేకరణ ట్రాక్టర్ మూలకు పడినా పట్టడం లేదని ఆరోపణ
- ఇన్‌చార్జి కమిషనర్ హామీతో ఆందోళన విరమణ



భూత్పూర్‌లో మున్సిపల్ కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలుపుతున్న కౌన్సిలర్లు

భూత్పూర్, జనవరి 20 : కౌన్సిలర్లు కన్నెర్ర చేశారు. భూత్పూరు మున్సిపల్ కార్యాలయంలో అధికారులు విధులు నిర్వర్తిస్తుండగానే తాళం వేశారు. అభివృద్ధి పనులు చేపట్టడం లేదని.. సమస్యలు పట్టించుకోవడం లేదంటూ నిరసన తెలిపారు. సోమవారం బల్దియా ఆఫీస్ ఎదుట బైఠాయించి కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ భూత్పూర్‌ను అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మున్సిపాలిటీగా మార్చారని గుర్తు చేశారు. అభివృద్ధికి ఢోకా లేకుండా నాటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ నుంచి రూ.20 కోట్ల నిధులను కూడా సమకూర్చేలా చర్యలు తీసుకున్నారన్నారు. నిధులతో భూత్పూర్-అమిస్తాపూర్ వరకు రోడ్డు మధ్యన డివైడర్, సెంట్రల్ లైటింగ్‌తోపాటు కూడళ్లలో పార్కులను(గార్డెనింగ్) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీంతో రెండుసార్లు జాతీయ స్థాయిలో ఉత్తమ మున్సిపాలిటీగా అవార్డులు వరించాయని పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి అభివృద్ధిలో కుంటుబడుతోందని వాపోయారు. అభివృద్ధికి నిధుల్లేక తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదన్నారు. మూడు నెలలుగా చెత్త సేకరణ ట్రాక్టర్ మూలకుబడినా రిపేర్ చేయించేందుకు నిధులు లేవన్నారు. మున్సిపల్ కమిషనర్ బదిలీపై వెళ్లి రెండు నెలలు అవుతున్నా.. నేటికీ స్థానం ఖాళీగా ఉన్నదని, ఇన్‌చార్జి కమిషనర్ ఉన్నా కౌన్సిల్ సమావేశాలు నిర్వహించడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బల్దియా అభివృద్ధికి నిధులు మంజూరు చేసి, స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై చంద్రశేఖర్ అక్కడకు చేరుకొని ఇన్‌చార్జి కమిషనర్‌కు ఫోన్‌లో విషయం తెలిపాడు. దీంతో జడ్చర్ల నుంచి లక్ష్మారెడ్డి వచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతోపాటు కౌన్సిల్ సమావేశం 25వ తేదీన నిర్వహిస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బాలకోటి, రామకృష్ణ, కోఆప్షన్ సభ్యుడు జాకీర్, బీఆర్‌ఎస్ నాయకులు సత్తూర్ నారాయణగౌడ్, మురళీధర్ గౌడ్, సత్యనారాయణ, అశోక్‌గౌడ్, యాదయ్య, తిరుపతయ్య, బీజేపీ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఫారూఖ్ తదితరులు పాల్గొన్నారు.

### తొమ్మిది మందిపై కేసు నమోదు

భూత్పూర్ మున్సిపల్ కార్యాలయానికి తాళం వేసిన విషయంలో మేనేజర్ శంకర్ ఫిర్యాదు మేరకు తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం మున్సిపాలిటీలో సమస్యలను పరిష్కరించాలని కౌన్సిలర్లు కార్యాలయానికి తాళం వేశారు. మేనేజర్ అధికారుల విధులకు ఆటంకం కలిగించారని ఫిర్యాదు చేయడంతో ఫ్లోర్ లీడర్ శ్రీనివాస్‌రెడ్డితోపాటు కౌన్సిలర్లు బాలకోటి, రామకృష్ణ, కోఆప్షన్ సభ్యులు జాకీర్, సత్యనారాయణ, నాయకులు ఫారూఖ్, మురళీధర్ గౌడ్, అశోక్‌గౌడ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాజోళి రైతులు

# ఇథనాల్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలి

- రాజోళి రైతులకు న్యాయం చేయాలి
- కలెక్టర్, ఎస్పీలకు రైతుల వినతి

రాజోళి, జనవరి 20 : రాజోళి మండల పరిధిలోని పెద్ద ధన్వాడ గ్రామంలో ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీ అనుమతులను రద్దు చేస్తూ రాజోళి మండల రైతులను అదుకోవాలని కలెక్టర్,ఎస్పీలను రైతులు కోరారు. సోమవారం పెద్ద ధన్వాడ గ్రామ రైతులతోపాటు మండలంలోని వివిధ గ్రామల రైతులు జిల్లా కలెక్టర్, ఎస్పీలను కలిసి ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుతో రైతులకు జరిగే నష్టాన్ని వివరించారు. పంటలు పండించుకునేందుకు భూములు కావాలని వచ్చి మా గ్రామంలో ఉన్న రైతులనుంచి భూములు తీసుకొని తీరా ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తూ మోసం చేస్తున్నారని చెప్పారు. ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే భూములు పంటలు పండక తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన కలెక్టర్ మీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామని చెప్పారు. అయితే మీ సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో రాజోళి మండల రైతులు పాల్గొన్నారు.